నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, మంగళవారం 24 సెప్టెంబర్ 2024 VIKARABAD



గాంధీ దవాఖాన వద్ద బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులను అడ్డుకుంటున్న పోలీసులు

# బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు

**మాతా, శిశు మరణాలపై అధ్యయనానికి వెళ్లిన నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు**

**పోలీసు పహారాలో గాంధీ దవాఖాన**

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ శ్రేణులు**

బన్సీలాల్‌పేట, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖాన పోలీసు క్యాంపు ఆఫీస్‌గా మారింది. దవాఖాన చుట్టూ ఎటు చూసినా పోలీసులు కనిపించడంతో రోగులు భయాందోళనకు గురయ్యారు. ఏమి జరుగుతుందో తెలియక కొంత మంది రోగులు దవాఖాన బయటి నుంచే వెనుదిరిగారు. గత నెలలో జరిగిన మాతా శిశు మరణాల నేపథ్యంలో దవాఖానలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. జరిగిన ఘటనపై నిజానిజాలు తెలుసుకునేందుకు సోమవారం గాంధీ దవాఖానకు వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కమిటీ సభ్యులు, వారికి మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు దవాఖానకు వస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఉదయం నుంచే దవాఖాన వద్ద భారీగా మోహరించారు. ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గాంధీ దవాఖానకు చేరుకోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దాంతో వారికి, పోలీసులకు మధ్య వాగ్వాదం జరుగడంతో వారిని అరెస్టు చేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ప్రజాపాలనలో ప్రజల ప్రాణాలకే రక్షణ లేకుండా పోయిందన్నారు. మాతా, శిశు మరణాల గురించి తెలుసుకునేందుకు వస్తే అడ్డుకుని, అరెస్టు చేస్తారా అని మండిపడ్డారు. చిన్నారులు పిట్టల్లా రాలిపోతుంటే వివరాలు తెలుసుకోవడం తప్పా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహా, విజయ్‌శంకర్, కే.దేవేందర్, మరి కొందరు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి చిలకలగూడ పీఎస్‌కు తరలించారు. సాయంత్రం వారిని సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. మెట్టుగూడ కార్పొరేటర్ సునీత, నాయకులు ఎస్.రాజేందర్, శ్రీనివాస్, ఓ.రాజు, అనిత వారికి మద్దతుగా పీఎస్‌కు వచ్చారు.

### దేశద్రోహుల వలే తీసుకెళ్లారు..

**- మాజీ ఎమ్మెల్యే ఆనంద్**

వికారాబాద్, సెప్టెంబర్ 23 : పోలీసులు దేశద్రోహుల వలే మమ్మల్ని వాహనాల్లో తీసుకెళ్లారని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తెలిపారు. సోమవారం బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులం గాంధీ దవాఖానకు వెళ్లగా అక్కడ పోలీసులు అడ్డుకుని అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. వాహనాల్లో దేశద్రోహులు, నక్సలైట్ల మాదిరిగా తరలించారు. ప్రజలకు మేలు చేయాలనుకుంటే ప్రభుత్వం మమ్మల్ని అరెస్టు చేయడం సరికాదన్నారు.



కమిటీ సభ్యులను వాహనంలో తరలిస్తున్న పోలీసులు

*జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై రైతాంగం అంతగా ఆసక్తి చూపడం లేదు. ఈ పంట సాగుపై కాంగ్రెస్ ప్రభుత్వం అంతగా ప్రచారం చేయకపోవడం..నీటి కొరత, కరెంట్ కోతల వంటి పరిస్థితులతోనే రైతులు ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. గతేడాది జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టగా.. మూడు వేల ఎకరాల లక్ష్యానికిగానూ ప్రభుత్వం నుంచి 1,310 ఎకరాలకు మాత్రమే పరిపాలనా అను మతులొచ్చాయి. అయితే ఇప్పటివరకు రైతులు 854 ఎకరాల్లోనే పంటను సాగు చేశారు. ఈ మాత్రం సాగు గత బీఆర్ఎస్ హయాంలోనే కాగా.. రేవంత్ ప్రభుత్వంలో కొత్తగా సాగైందీ ఏమీలేదు. గత లక్ష్యమే పూర్తికాకపోవడంతో.. కొత్తగా టార్గెట్‌ను నిర్దేశించుకునే సాహసాన్ని ఉద్యానవన శాఖ అధికారులు చేయలేకపో తున్నా రు. ఈ పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగు పట్ల రైతులను చైతన్యపర్చేందుకు సంబం ధిత శాఖ అధికారులు విస్తృతంగా సమావేశాలు నిర్వహించే పనిలో నిమగ్నమయ్యారు.*

*- రంగారెడ్డి, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ)*



**ఇందుకు**
**కారణం నీటి కొరత, కరెంట్ కోతలే**
**కాంగ్రెస్ ప్రభుత్వంలో లోపించిన ప్రచారం..**
**సాగుకు ముందుకు రాని రంగారెడ్డి జిల్లా అన్నదాతలు**
**కేసీఆర్ ప్రభుత్వంలో ఆయిల్ పామ్ సాగుకు అధిక ప్రాధాన్యం**
**గతేడాది 3000 ఎకరాల లక్ష్యానికి గాను.. సాగవుతున్నది 854 ఎకరాలే**
**రైతులను చైతన్యపరిచేందుకు అధికారుల చర్యలు**
**25న మెగా ప్లాంటేషన్ నిర్వహించేందుకు జిల్లా ఉద్యానవన శాఖ సన్నాహాలు**

# ఆయిల్ పామ్‌పై..అనాసక్తి

### ప్రోత్సాహం అందిస్తున్నా..

రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇతోధికంగా సబ్సిడీ ఇస్తున్నది. ఎకరంలో ఆయిల్‌పామ్ సాగు కోసం ప్రభుత్వం రైతుకు రూ.50,600 రాయితీ ఇస్తున్నది. ఎకరంలో 57 మొక్కలు నాటాల్సి ఉండగా..ఒక్కొక్క మొక్కకు రూ.200 ధర ఉంటుంది. ఈ లెక్కన రెండు వందల మొక్కలకు రూ.11,400 అవుతుండగా ..ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ ఇస్తుండగా.. రైతు వాటా కింద రూ.1,140 చెల్లిస్తే సరిపోతుంది. అలాగే డ్రిప్ కోసం ఎకరాకు రూ.30 వేలు ఖర్చు అవుతుండగా.. రైతు వాటా కింద రూ.7వేలు చెల్లిస్తే మిగతా రూ.23 వేల వరకు ప్రభుత్వం భరిస్తుంది. డ్రిప్ సిస్టమ్ కోసం బీసీలకు 90 శాతం.. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ వర్తిస్తున్నది. పన్నెండున్నర ఎకరాల వరకు రైతులు ప్రభుత్వం నుంచి రాయితీలు పొందే అవకాశం ఉన్నది. అలాగే మొక్కలు నాటిన నాలుగేండ్ల వరకు కాత రాదు. ఈ సమయంలో మొక్కల సంరక్షణతోపాటు ఆయిల్ పామ్ అంతర పంటల సాగు కోసం ప్రభుత్వం రూ.4,200 చొప్పన నాలుగేండ్లకు రూ.16,800 చెల్లిస్తుంది. రైతులు కేవలం గుంతలు తీసుకుని మొక్కలు, డ్రిప్ కోసం రూ.8,140 చెల్లిస్తే సరిపోతుంది. ఈ సాగుతో నాలుగేండ్ల తర్వాత నుంచి 30 ఏండ్ల వరకు నిరంతర ఆదాయాన్ని పొందొచ్చు. పదేండ్ల తర్వాత ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఆయిల్ పామ్ సాగుకు గత కేసీఆర్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నివ్వగా.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మరోపక్క నీరు, కరెంటు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రైతులు ఈ పంట సాగుకు ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. అయితే భూముల ధరలకు ఈ ప్రాంతంలో ఉన్న డిమాండ్ దృష్ట్యా దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్‌వైపు రైతులు మొగ్గు చూపడంలేదని అధికారులు మరో కారణంగా చెబుతున్నారు.

**ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం ఇలా..**

| కేటాయింపులు | ఎకరానికి రాయితీ (రూ.లలో) |
|---|---|
| మొక్కలకు (ఎకరానికి 50-57 మొక్కలు) | 11,600 |
| మొదటి ఏడాది ఎరువులు, అంతర పంటలకు | 4,200 |
| రెండో ఏడాది | 4,200 |
| మూడో ఏడాది | 4,200 |
| నాల్గో ఏడాది | 4,200 |
| బిందు సేద్యం | 22,518 |

### 25న మెగా ప్లాంటేషన్..

ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు సదస్సులు, సమావేశాలు నిర్వహించి రైతు లను చైతన్యపర్చేందుకు ఉద్యానవన శాఖ అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. ఇప్పటికే లాభదాయకంగా సాగు చేస్తున్న ఆదర్శ రైతులను పరిచయం చేసేందుకు ఖమ్మం, సిద్దిపేట తదితర ప్రాంతాలకు జిల్లా రైతులను తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 25న మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టేందుకు జిల్లా ఉద్యాన వన శాఖ సన్నాహాలు చేస్తున్నది. 18 మండలాల పరిధిలో 96 మంది రైతులకు సంబంధించిన 300 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును చేపట్టేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### రైతులు ఈ సాగుపై దృష్టిసారించాలి..



జిల్లా రైతులు ఆయిల్‌పామ్ వైపు దృష్టి సారించాలి. ఈ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలను అందిస్తున్నది. మొక్కలు నాటడం, సస్యరక్షణ చర్యలు, పంటల విక్రయాల వరకు ఉద్యాన శాఖ అండగా ఉంటుంది. ఇప్పటికే ఆయిల్ పామ్ తోటలు సాగు అవుతున్న ప్రాంతాలకు రైతులను తీసుకెళ్లి చూపిస్తు న్నాం. రైతువేదికల్లోనూ సమావేశాలు నిర్వహించి చైతన్యపరుస్తున్నాం. ఇందులో భాగంగా ఈ నెల 25న మెగా ప్లాంటేషన్‌ను చేపడుతున్నాం.

**–కె.సురేశ్, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి, రంగారెడ్డి**

# బెటర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై చర్చ



*బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్*

సిటీబ్యూరో, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ట్రై పోలీస్ కమిషనరేట్లలో సరైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ సేఫ్టీకి సంబంధించి సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లతో పాటు జీహెచ్ఎంసీ, హైడ్రా, హెచ్ఎండీఏ అధికారులతో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ ఆధ్వర్యంలో సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ సమస్యలు, భారీ వర్షాల సమస్యలు, బెటర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆయా విభాగాల అధికారులు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకొని నగర సీపీ సీవీ ఆనంద్ తీసుకోవాల్సిన అంశాలపై ఈ సందర్భంగా వివరించారు. భారీ వర్షాలు వచ్చినప్పుడు ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ, రోడ్లు, క్రిటికల్ జంక్షన్ల వద్ద ఏర్పడే సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేయడంలో అన్ని శాఖలు పనిచేయాలని తెలిపారు. ఇందులో సరైన ట్రాఫిక్ మళ్లింపులు, వాతావరణ విశ్లేషణలు, నోటిఫికేషన్లు, సైనేజ్ బోర్డులు, ఇంజినీరింగ్ విభాగం నుంచి అవసరమైన మార్పులు, వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద వేగంగా నీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులకు సూచించారు. దీర్ఘకాలిక ప్రణాళికలతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా అధికారులు నిర్ణయించారు. ఆయా విభాగాల అధికారులతో సంయుక్తంగా వర్క్‌షాప్ నిర్వహించడం, ట్రై పోలీస్ కమిషనర్ల ట్రాఫిక్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ, ఇతర విభాగాల అధికారులతో హై లెవల్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఐటీ కంపెనీలతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో నగర అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్, రాచకొండ, సైబరాబాద్ సీపీలు సుధీర్‌బాబు, అవినాష్ మహంతి, అధికారులు పాల్గొన్నారు.



నగరంలో సోమవారం వర్షం దంచికొట్టింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల వరదనీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రోడ్లపై వరదనీరు నిలువడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## బడికి డుమ్మా కొడితే..
# పేరు తొలగిస్తాం



**విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చర్యలు**

**హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : బడికి డుమ్మా కొడితే ఇక పేరు తొలగించడమే. విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు సక్రమంగా వచ్చేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రతి పాఠశాలపైనా రిపోర్ట్ తీసుకుంటానని తెలిపారు. నెలకంటే ఎక్కువ రోజులు రాని విద్యార్థుల పేర్లు ఎఫ్ఆర్‌సీ నుంచి తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. కాగా, ప్రజావాణిలో భాగంగా 147 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీస్) కదిరవన్, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు ఆశన్న, యాదయ్య, జిల్లా ఇంటర్ విద్యాధికారి వడ్డెన్న, కోటాజీ, రాజేందర్ పాల్గొన్నారు.

### వైద్య సేవల్లో నిర్లక్ష్యం.!

**ముగ్గురికి షోకాజ్ నోటీసులు**

వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను హెచ్చరించారు. సమయానికి విధులకు హాజరు కాకుండా రోగులను ఇబ్బందులకు గురి చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బంజారాహిల్స్‌లోని విమలానగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది వివరాలు ఆరా తీసి, ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులపట్ల నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బంది విజయలక్ష్మి, నాగలక్ష్మి, పార్వతిలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్యాధికారికి ఆదేశాలిచ్చారు. కలెక్టర్ వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగకార్తీక్ తదితరులు ఉన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

**ప్రజావాణిలో 62 దరఖాస్తుల స్వీకరణ**

**పోలీసుల ఆంక్షలతో ఇబ్బందిపడ్డ దరఖాస్తుదారులు**

రంగారెడ్డి, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సో మవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 62 ఫిర్యాదులొచ్చాయి. కలెక్టర్ స్వయంగా దరఖాస్తుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న 'ప్రజావాణి'కి ప్రజల నుంచి వచ్చే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎంట్రీ చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అడుగడుగునా..పోలీసుల ఆంక్షలు..

కలెక్టరేట్ వద్ద పోలీసుల ఆంక్షలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయి. వివిధ సమస్యలపై కొంత మంది ధర్నా కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో కలెక్టరేట్‌లోకి వెళ్లే వారిని నిశితంగా తనిఖీ చేసి పోలీసులు పంపించారు. అయితే ప్రజావాణిలో దరఖాస్తు చేసేందుకు వచ్చిన వారిని కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్దనే పోలీసులు నిలువరించారు. దీంతో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పలువురు అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అర్జీదారుడిని మాత్రమే లోపలికి అనుమతించడంతో అతడితో వచ్చిన వారు బయటే ఉండిపోయారు. తమకు సమస్యలు చెప్పుకొనే అవకాశం లేకుండాపోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

# దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**

వికారాబాద్ : దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో జరిగిన ప్రజావాణికి ఆయన హాజరై ప్రజల నుంచి దర ఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కాగా ప్రజావాణికి 179 ఫిర్యాదులు వచ్చాయి. రైతు రుణమాఫీ, భూసమస్యలు అధికంగా వస్తున్న నేపథ్యంలో మండల స్థాయిలో పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర , జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్